క్లుప్తంగా

ఆలయ శంకుస్థాపనలో శాప్‌నెట్ చైర్మన్



శంకుస్థాపన కార్యక్రమంలో చైతన్య

అద్దంకి: సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో గురువారం నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరయ్యారు. పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంతమాగులూరు మండల నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులతో ఆమంచి సమావేశం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులతో గురువారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు గురించి చర్చించి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులతో పాటు పలు గ్రామాలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెస్ కోడ్ పాటించాలి



నిర్మాణంలో ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

మేదరమెట్ల: గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా డ్రెస్‌కోడ్‌ను పాటించాలని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంలో ఎలాంటి అశ్రద్ధ ఉండకూడదన్నారు. జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన సిబ్బందితో కలసి పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు ప్రజలకు అందించే సేవలను మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రజలతో కలసి మెలిసి ఉండాలని సూచించారు.

హద్దురాళ్ల ఏర్పాటుతో భూ సమస్యలకు చెక్



హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్

బల్లికురవ: ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష సమగ్ర భూ సర్వే హద్దు రాళ్ల ఏర్పాటును రైతులు దగ్గరుండి ఏర్పాటు చేయించుకోవాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి కోరారు. గురువారం కూకట్లపల్లి సచివాలయం పరిధిలో జరుగుతున్న హద్దురాళ్ల ఏర్పాటు ప్రక్రియను ఆయన పరిశీలించారు. సర్వే టీమ్‌కు పలు సూచనలు చేశారు. ఇప్పటికే మండలంలోని వేమవరం, కూకట్లపల్లి, కొప్పరపాడు, వైదన, వల్లాపల్లి, బల్లికురవ, కొణిదెన గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని చెప్పారు. దశల వారీగా హద్దు రాళ్ల ఏర్పాటుతో పాస్‌పుస్తకాలు అందజేస్తున్నామని రైతులు సహకరించాలని కోరారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యార్థుల షూస్



షూస్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

చినగంజాం: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు వేసవి సెలవుల అనంతరం పంపిణీ చేయాల్సిన షూస్ గురువారం ఎమ్మార్సీకి చేరాయి. మండలంలోని మొత్తం 4023 విద్యార్థులకు అవసరమైన షూస్‌ను జిల్లా కేంద్రం నుంచి తీసుకొని రావడంతో ఎంఈఓ డీ గంగాధర్ స్వయంగా నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, పార్ట్ టైం ఉద్యోగులు పాల్గొని పరిశీలించారు.



జనసంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న మెయిన్ సెంటర్



కర్ఫ్యూను తలపిస్తున్న వన్ వే రోడ్డు

భానుడి భగభగ..

- మూడు రోజుల పాటు ఎక్కువగా ఎండల తీవ్రత
- వాతావరణ శాఖ హెచ్చరిక
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

వేటపాలెం: భానుడు భగభగమని మండిపోతున్నాడు. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టాలంటేనే భయం వేస్తోందని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. రోహిణి కార్తె రాక ముందే ఎండలు ఎక్కువవడంతో ఇంటి నుంచి కాలు బయటపెడితే నడినెత్తి సుర్రుమంటోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఉక్కపోతతో జనం అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగిపోతోంది. రోడ్ల మీదకు రావాలంటేనే జనం హడలిపోతున్నారు. రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం ఉష్ణోగ్రతలు 40 నుంచి 41 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. కొద్ది రోజులుగా ఉపరితల ఆవర్తనం కారణంగా అక్కడక్కడా అకాల వర్షాలు కురవడం, ఆకాశం మేఘాలు పట్టి ఉండటంతో కొంత ఉపశమనం కలిగింది. కానీ, నాలుగు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. రోహిణి కార్తె వచ్చిన తర్వాత కానీ ఎండల తీవ్రత పెరగదని ప్రజల నమ్మకం. ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండగా, అప్పుడే ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాబోయే నాలుగు రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించింది. వేటపాలెంలోని గడియార స్తంభం సెంటర్ నిత్యం జనసంచారంతో నిండిపోయి ఉంటుంది. ఎండల తీవ్రతకు ప్రధాన సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, వన్ వే రోడ్డు, లైబ్రరీ రోడ్డు, మైన్ రోడ్డు జనసంచారం లేకపోవడంతో కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. దుకాణాలన్నీ మూసివేశారు.

శీతల పానియాల వ్యాపారాలు డీలా..

వేసవి కాలంలో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందడానికి శీతల పానియాలు ఎక్కువగా ఇష్టపడతారు. అందుకు తగ్గట్లు ప్రధాన వీధుల్లో కూల్‌డ్రింక్స్, జూస్ షాపులు ఎక్కువగా వెలిశాయి. ఎండల దెబ్బకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఆయా దుకాణాలను తెరిచి ఉంచుతున్నారు. ఎండల తీవ్రతకు శీతల పానియాలు దుకాణాలు మూసివేస్తున్నారు.

> **తగిన జాగ్రత్తలు తీసుకోవాలి..**
> ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వడగాడ్పులు పెరిగే అవకాశాలు కూడా అధికంగానే ఉంటాయి. ఈ కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల సమయంలో బయట తిరగడం మంచిది కాదు. చెమటలతో శరీరం డీహైడ్రేషన్‌కి గురికాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, బారీ తాగుతుండాలి. నీరసమనిపిస్తే ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిది.
> – ప్రభాకరరావు, వైద్యాధికారి, వేటపాలెం పీహెచ్‌సీ

ప్రజా సంక్షేమమే మా అభిమతం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ ఫలాలు
- ఏపీ శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

జే.పంగులూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే మా అభిమతమని ఆ దిశగా పార్టీలు, వర్గాలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్నామని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి కుంటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెంలో గురువారం కృష్ణచైతన్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావులతో కలిసి కృష్ణచైతన్య గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్ అందించారు. గ్రామంలో ఉన్న మురుగు సమస్యను కృష్ణచైతన్య దృష్టికి తీసుకుపోగా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు జాగర్లమూడి నాగేశ్వరావు, మహేష్, శ్రీనివాసరావు, కేశినేని శ్రీనివాసరావు, అజీల్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

శుక్లాల ఆపరేషన్‌కు 123 మంది తరలింపు



ఆపరేషన్ కోసం రోగులను తరలిస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: ఈనెల 7 రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 170 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారుగా గుర్తించారు. వారిలో 123 మంది గురువారం ఆపరేషన్‌కు పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు రెండు బస్సుల్లో పంపించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, రోటరీక్లబ్ సభ్యులు అద్దంకి లెవీ ప్రసాద్, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మీ, చందలూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూరిత వాతావరణం

చీరాల రూరల్: క్రీడలు స్నేహపూరిత వాతావరణాన్ని పెంపొందిస్తాయని, క్రీడలలో నైపుణ్యం సాధించిన క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించుకున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌బాబు సౌజన్యంతో సతీష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లాస్థాయి రెడ్ టిన్నిస్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శరీర సౌష్టవానికి ఎంతగానో ఉపయోగపడతాయని, యువకులు చెడు మార్గంలో నడవకుండా సన్మార్గంలో క్రమశిక్షణతో నడిచేందుకు దోహదం చేస్తాయని చెప్పారు. పోటీల నిర్వాహకులు డి. సతీష్, డి. రాబిన్‌లు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 25 జట్లు పోటీ పడుతున్నాయని చెప్పారు. పోటీలో విజేతలుగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతిగా రూ. 15,000 రెండో బహుమతిగా రూ. 10,000 మూడో బహుమతిగా రూ. 7000 అందించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు మంచినీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మల్లెల లలితా రాజశేఖర్, ఫుట్‌బాల్ కోచ్ బొనిగల ప్రేమయ్య, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: చీరాల పట్టణ పరిధిలోని కొత్తపేట పంచాయతీ ప్రసాద్ నగరంలో నిర్మించనున్న రోడ్డును గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పరిశీలించారు. ప్రసాదనగరంలో ఆంజనేయస్వామి గుడికి వెళ్లే రోడ్డు కొరకు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వెంకటేష్‌లకు అర్జీ పెట్టుకున్నారు. గురువారం కరణం వెంకటేష్ రోడ్డును పరిశీలించి రోడ్డు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడివలస దేవరాజు, నంగు రాజశేఖరరెడ్డి, ఆంజనేయస్వామిరెడ్డి, కమిటి సభ్యులు దండే మునలారెడ్డి, నక్కల శ్రీనివాస్, వీసా రత్తయ్య, వీసా శంకర్, వడ్లమూడి కోటేశ్వరరావు, బూదాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామంలో ఈ నెల 13వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిసున్నట్లు మార్కెట్ ఎగ్జిక్యూటి పి కాలేషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం ఒంగోలు కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యశాల ఎముకలు, కీళ్లు, నరాలు, కంటి చూపు, గుండె, గ్యాస్ ట్రబుల్, సాధారణ వ్యాధులు చూస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా షుగరు, బీపీ, ఈసీజీ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు



నాభిశిలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

బల్లికురవ: బల్లికురవలోని గ్రామ దేవత పోలేరమ్మ కొలుపులు వారం రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. డప్పు వాయిద్యాలతో ఇంటింటా తిరుగుతూ సద్ది సేకరించి అమ్మవారి వద్ద నివేదించారు. గ్రామ కూడలిలోని నాభిశిల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని మహిళలు ప్రార్థించారు. ఆదివారంతో కొలుపుల వేడుకతో ముగియనున్నాయి.

గ్రంథాలయాలతో మరింత విజ్ఞానం



విద్యార్థులతో నీతి కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్



అద్దంకి: వేసవి శిక్షణ తరగతుల్లో విదార్థులు

చీరాల అర్బన్: విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ డి.ధనమ్మ అన్నారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం పిల్లలతో నీతి కథలు, జనరల్ నాలెడ్జ్, సుమతీ శతకాలు, ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలు చదివించారు. అనంతరం క్యారమ్స్, చెస్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే శిబిరంలో విద్యార్థులందరూ పాల్గొని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. శిబిరంలో 26 మంది విద్యార్థులు హాజరయ్యారు.

యోగా శిక్షణ తరగతులు..

అద్దంకి రూరల్: అద్దంకి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం యోగా నేర్పించారు. తదుపరి కథలు చెప్పడం, ఇంగ్లిషు గ్రామర్ బోధించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ చుండూరు సుగుణరావు, తాళ్లూరి బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ కుటుంబ రక్ష పథకం ద్వారా ఆర్థిక సాయం



చెక్ అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో వాసవీ కుటుంబ సురక్ష పథకం ద్వారా ఇంకొల్లుకు చెందిన కూనిశెట్టి నాగరాజుకు గురువారం అద్దంకిలోని వాసవిక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ నివాసంలో రూ. 3.40 లక్షలు చెక్ అందజేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు క్లబ్ జోన్ చైర్మన్ దొగిపర్తి అప్పయ్య, ఊటుకూరి శ్రీనివాసరావు, చుండూరి సాంబశివరావు, ఆత్మకూరి ఆంజనేయులు, క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తాం



విద్యుత్‌లైన్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల: పట్టణంలోని 7వ వార్డులో నెలకొని ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. 7వ వార్డులో ఎలక్ట్రికల్ లైన్లు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన ఎలక్ట్రికల్ డిఈతో మాట్లాడారు. ఎలక్ట్రికల్ లైన్లు ఏర్పాటును వేగవంతం చేయాలని ఆయన సూచించారు. అలానే సీసీ రోడ్లు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ శ్యామ్, వార్డు నాయకులు యాతం మేరిబాబు, పేర్లి నాని, కాంట్రాక్టర్ జోషి, స్థానికులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండితే చాలు ఓటు హక్కు



బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

చీరాల: 18 సంవత్సరాలు నిండిన వారు సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు కార్డుకు దరఖాస్తు చేసుకుని ఓటు కార్డును పొందాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల గుర్తింపు కార్డులు, క్లెయిమ్స్ వెరిఫికేషన్ కోసం బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. అలానే పట్టణంలో ఓటు కార్డు లేనివారు సమీపంలోని పోలింగ్ బూత్‌కు వెళ్లి సంప్రదించాలన్నారు. బీఎల్‌వోల వద్దకు వచ్చిన అప్లికేషన్లను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలన్నారు. పట్టణంలో 66 పోలింగ్ స్టేషన్లు, 66 మంది బూత్ లెవల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. బీఎల్‌ఓలపై పర్యవేక్షణకు ఎనిమిది మంది సూపర్‌వైజర్లను కార్యాలయం నుంచి నియమించి ఒక్కొక్కరికి 10 మంది చొప్పున కేటాయించామన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వివాదాలతో జీవితం అంధకారం



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

యద్దనపూడి: వివాదాలతో జీవితం అంధకారం చేసుకోవద్దని బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అర్ధరాత్రి మార్టూరు గ్రామంలోని సూర్య దాబా వద్ద జరిగిన ఘర్షణ నేపథ్యంలో గురువారం సాయత్రం డీఎస్పీ మండలంలోని పోలూరు, యద్దనపూడి, చింతపల్లిపాడు గ్రామాల్లో పర్యటించారు. ఘర్షణకు సంబంధించిన ఇరువర్గాలు యద్దనపూడి మండలంలోని వారే కావటంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా దాడికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్టూరు సీఐ ఫిరోజ్, ఎస్సై అనూక్, రైటర్ ఆంజనేయులు, ఏఎస్సై శేషసాయి ఉన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కారంచేడు: సంక్షేమ పథకాల అమలులో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్ వెంకటరత్నం అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు-3 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని రైతులకు, విద్యార్థులకు అవసరమైన అర్జీల పరిష్కారంలోను సిబ్బంది ముందుండాలన్నారు. వారి నుంచి స్పందనకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరవ్వడంతో పాటు, యూనీఫాం ధరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అరుణ, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిచేసి గాయపరచిన వారిపై కేసు

చినగంజాం: ఇరువురిపై దాడి చేసి గాయపరచిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై సురేష్ వివరాల మేరకు.. మండలంలోని పెదగంజాం పంచాయతీ బుచ్చిగుంట గ్రామానికి చెందిన నిర్మలమ్మ, పవన్‌కుమార్‌లపై ఈనెల 9వ తేదీ రాత్రి శేషయ్య, మరియదాసు, అనిల్, వినోద్‌లు దాడి చేశారు. గ్రామంలో సిమెంట్ బల్లను నిర్మలమ్మ, పవన్‌కుమార్‌లు తీసుకొని వెళ్లి వారి దుకాణం వద్ద వేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన ఆ నలుగురు బల్ల తీసుకొని వెళ్లి మీరు వేసుకుంటారా అంటూ వాదనకు దిగి వారిపై దాడి చేసి గాయపరచారు. దాంతో బాధితులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం దహనం

మార్టూరు: మామిడి తోటలో నిలిపి ఉంచిన బైకును గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టిన ఘటన మండలంలోని కోలలపూడి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు వివరాల మేరకు.. కోలలపూడి గ్రామానికి చెందిన పాలపర్తి దానామూర్తి అదే గ్రామానికి చెందిన గాలి అరుణ్‌కుమార్ మోటారు సైకిల్‌పై వలపర్ల వెళుతూ దానా మూర్తి తన బైకును ఊరి వెలుపల గల తాతినేని కోటయ్యకు చెందిన మామడి తోటలో ఉంచి వలపర్ల వెళ్లారు. తిరిగి వచ్చి తన బైకు కోసం తోటలో దానామూర్తి గుర్తు తెలియని వ్యక్తులు బైకును తగులబెట్టినట్లు గుర్తించాడు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు